క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న అబ్దుల్ రెహమాన్

లింగాపూర్: మండల కేంద్రానికి చెందిన జాదవ్ శంకర్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. మండల కేంద్రానికి చెందిన ఆడే సక్రిబాయి అనే ఒంటరి వృద్ధాప్య మహిళకు రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ నాయక్ కిరణ్, జాదవ్ గణపత్, మాజీ జెడ్పీటీసీ లక్కా నాయక్, వినోద్, దవీత్‌కుమార్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



కమ్మర్‌గాంలో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో నిర్వహిస్తున్న రైతుభరోసా, రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్‌తో కలిసి పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు చేయొద్దని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి మనీషా, ఏఈవో శివ, జూనియర్ అసిస్టెంట్ నారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

'కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దు'

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా కమిటీలు, కమిషన్ పేరుతో కాలయాపన చేస్తూ మాదిగల సహనాన్ని పరీక్షించొద్దని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రావు మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఫిబ్రవరి 7న లక్ష డప్పులు వెయ్యి గొంతుల పేరుతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. జిల్లాలోని మాదిగ విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, మహిళలు, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ నాయకులు లింగంపెల్లి ప్రభాకర్, నర్సింగరావు, వేమునూరి భాస్కర్, రాజేందర్, రాజేశ్, నాయకులు స్వామి, శంకర్, నర్సింహులు, మూర్తి, భుజంగరావు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రెబ్బెన: మండలంలోని గోలేటి విలేజ్‌కు చెందిన బానోత్ కళావతి, బానోత్ మోతిలాల్ దంపతులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా వారి కుమారుడు అనాథగా మారడంతో శనివారం బీఆర్ఎస్ నాయకులు అతన్ని పరామర్శించారు. అతనికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, మాజీ సర్పంచ్ తోట లక్ష్మణ్, దయాకర్, సుబ్బారావు, గణేశ్, శ్రీనివాస్, కృష్ణ, ఆసీఫ్, ప్రదీప్, దేవయ్య, ఉద్ధనాయక్, వసంత్ రావు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని లింగాపూర్ మండలానికి చెందిన మామిడిపల్లి గ్రామానికి చెందిన 50 మంది వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లింగాపూర్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షెడ్డులోనే పాఠాలు..!

- వరద ధాటికి లంజన్బీర పాఠశాల భవనం ధ్వంసం
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని వైనం
- నాలుగేళ్లుగా రేకుల షెడ్డులోనే తరగతుల బోధన



వరదలకు ధ్వంసమైన పాఠశాల భవనం



రేకుల షెడ్డులో కొనసాగుతున్న తరగతులు

వాంకిడి: పాఠశాలకు పక్కా భవనం కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాఠశాల భవనం లేక రేకుల షెడ్డులోనే తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం 2021 జూలైలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లంజన్బీర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం తీవ్రంగా ధ్వంసమైంది. భవనం కింది భాగంతో పాటు పాఠశాలకు సంబంధించిన రికార్డులు పూర్తిగా వరదలో కొట్టుకుపోయాయి. దీంతో గోడలు మాత్రమే మిగిలాయి. అప్పటి నుంచి తరగతుల నిర్వహణకు ప్రత్యేక భవనం లేకుండా పోయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాఠశాల భవనాన్ని అనేకసార్లు పరిశీలించారు. కానీ దానికి మరమ్మతులు చేపట్టడం.. నూతన భవనం నిర్మాణానికి నిధుల కేటాయించడం వంటి చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ప్రస్తుతం గ్రామంలోని గుడి పక్కన గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు.

తరగతుల నిర్వహణలో ఇక్కట్లు..

లంజన్బీర ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 12 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గతంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉండగా చాలా మంది పిల్లలు హాస్టళ్లకు వెళ్లడంతో ప్రస్తుతం 12 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వరదలకు పాఠశాల భవనం ధ్వంసం కాగా అప్పటి నుంచి తరగతుల నిర్వహణకు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మొదట్లో అంగన్‌వాడీ కేంద్రంలో కొన్ని రోజులు కొనసాగించగా ఇబ్బందులు తలెత్తడంతో గ్రామ పటేల్ ఇంటి పందిరిలో కొన్ని రోజులు నిర్వహించారు. అక్కడ కూడా అనుకూలంగా లేకపోవడంతో గుడి పక్కన టెంట్ ఏర్పాటు చేసుకుని కొనసాగించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గుడి పక్కన రేకులతో ఒక షెడ్డు నిర్మించడంతో రెండేళ్ల నుంచి అక్కడే తరగతులు కొనసాగిస్తున్నారు. పాఠశాల నిర్వహణకు గ్రామంలో మరో ప్రభుత్వ భవనం లేకపోవడంతో షెడ్డులోనే కొనసాగించాల్సి వస్తుంది. మూత్ర శాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పాఠశాల రికార్డులు భద్రపరిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఇబ్బందులు మరింత దారుణంగా ఉంటున్నాయి. భారీ వర్షాలు కురిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులు కూర్చునేందుకు కూడా స్థలం ఉండని పరిస్థితి ఉంది.

ప్రభుత్వ పథకాలకు దూరం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు –మన బడి' పేరుతో పాఠశాలల ఆధునీకరణకు నిధులను మంజూరు చేసింది. మండలం నుంచి పదుల సంఖ్యలో పాఠశాలలు ఎంపికైనా లంజన్బీర పాఠశాలకు మాత్రం నిరాశే ఎదురైంది. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' పేరుతో పాఠశాలల్లో మేజర్, మైనర్ రిపేర్లు చేసుకునేందుకు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఈ పథకంలోనూ పాఠశాలకు సరైన ప్రాధాన్యత లభించలేదు. గతేడాది వర్షాకాలంలో జిల్లా ఉన్నతాధికారులు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద వివరాలు నమోదు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఒకవేళ అదే భవనాన్ని మరమ్మతులు చేయించి కొనసాగిస్తే.. భవిష్యతులో మళ్లీ వరదలు వస్తే ఉపయోగం లేకుండా పోతుందనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి నూతన భవన నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోతురాజా మళ్లీ వస్తాం..!



మైసమ్మకు నూనెతో అభిషేకం చేస్తున్న గిరిజనులు

వెళ్లి వస్తాం.. పోతురాజా అంటూ భక్తులు తిరుగు పయనమయ్యారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన పోతురాజు, ధర్మరాజు ఉత్సవాలు శనివారం ముగిశాయి. కెరమెరి మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలో గల ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి కొలాం తెగకు చెందిన భక్తులతో పాటు ఇతర భక్తులు తరలివచ్చి తమ మొక్కులు సమర్పించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందిన పోతురాజు, ధర్మరాజు, భీమదేవరకు ప్రత్యేక పూజలు చేశారు. – కెరమెరి



చివరిరోజు దర్శనానికి క్యూకట్టిన మహిళలు



టెంకాయలు కొడుతున్న భక్తులు



నృత్యం చేస్తున్న భక్తులు



ఆది దేవతలకు మొక్కుతున్న కమిటీ సభ్యులు

బడి బయట పిల్లల సర్వే

వాంకిడి: మండలంలోని సామేల, ఒడ్డెరవాడ గ్రామాలలో శనివారం సీఆర్పీ దుర్గం సందీప్ ఆధ్వర్యంలో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన సెండె సాయినాథ్, అదె తిరుపతిలను బడి మానేసిన పిల్లలుగా గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బడి బయటి బాలికలు ఉంటే కస్తూరిబా గాంధీ పాఠశాలలో, బాలురు అర్బన్ గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 10వ తరగతి, ఇంటర్ చదివి ఫేయిల్ అయి చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్‌లు కల్పించడమే కాకుండా పరీక్ష ఫీజులు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. గ్రామంలో ఎవరైనా ఇలాంటి వారు ఉంటే 96666 65253 నంబర్‌కు సమాచారం అందించాలని, వెంటనే వివరాలు నమోదు చేసుకుని పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



నగదు అందజేస్తున్న పెందోర్ మోతీరాం

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలో ఉన్న పోతురాజు, ధర్మరాజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం ప్రారంభమైన కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. విజేతగా మానిక్‌గూడ జట్టు నిలువగా, ద్వితీయస్థానంలో టీఎంకే స్టార్, తృతీయ స్థానంలో కొఠారి జట్టు నిలిచాయి. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో రూ.7777 లను మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం అందించగా, రెండో బహుమతి మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో రూ. 5555లను కలాం తనయుడు రిజ్వాన్ అందించారు. మూడో బహుమతి రూ.3333 లను కమిటీ నిర్వాహకులు అందించారు. నాయకులు సిడాం రాజు, సిడాం ధర్మూ, కుద్మెత సోము, చందన్‌షావ్, ఆత్రం రాము, భరత్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వన్యప్రాణులను హతమారిస్తే జైలుకే

బోథ్: వన్యప్రాణులను హతమారిస్తే మూడు నుంచి ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందని బోథ్ రేంజ్ అటవీశాఖ అధికారి ప్రణయ్ కుమార్ అన్నారు. అటవీ సంరక్షణ–వన్యప్రాణుల సంరక్షణ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవులను నరకడం, వన్య ప్రాణులను ఉచ్చుపెట్టి, కరెంటు పెట్టి చంపితే చట్ట రీత్యా నేరమన్నారు. పులులు సంచరిస్తున్న నేపథ్యంలో రైతులు చేలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి అమర్ సింగ్, ఎఫ్ఎస్‌వో నాగోరావ్, ముంతాజ్, జూనియర్ అసిస్టెంట్ పరశురామ్, ఎఫ్ఆర్‌వో సంధ్యరాణి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ డబ్బులు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో సీఎంపీఎఫ్ డబ్బుల కోసం దరఖాస్తు చేసుకున్న కాంట్రాక్టు కార్మికులకు వెంటనే డబ్బులు చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేసి వివిధ కారణాలతో పని మానేసిన కాంట్రాక్టు కార్మికులు చాలా మంది ఉన్నారన్నారు. గత సంవత్సరం పని మానేసిన కాంట్రాక్టు కార్మికులు సీఎంపీఎఫ్ డబ్బుల కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదన్నారు. నాయకులు సాగర్‌గౌడ్, జంపయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న సభ్యులు

కౌటాల: మహారాష్ట్రలోని చెప్రాడలోని కార్తీక్ స్వామి ఆలయానికి శనివారం బెజ్జూర్ నుంచి 20వ మహా పాదయాత్ర నిర్వహించారు. భక్తులు పాదయాత్ర కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి మీదుగా మహారాష్ట్రకు సాగింది. దీంతో తుమ్మిడిహెట్టిలోని కార్తీక స్వామి మహరాజ్ ఆలయం వద్ద భక్తులకు తాటిపల్లి హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు అల్పాహారం పంపిణీ చేశారు. కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, సభ్యులు గంగారం, రమేశ్, విష్ణు, ఆకాశ్, మధుకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు'

ఆసిఫాబాద్: రేషన్ కార్డులు లేని వారు కొత్తకార్డుల కోసం గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలతో పాటు ఎంపీడీవో కార్యాలయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దీంతో పాటు రేషన్ కార్డు కలిగి ఉండి వాటిలో కుటుంబ సభ్యుల పేర్లు లేని వారు, మార్పులు, చేర్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వీటితో పాటు ఇందిరమ్మ ఇండ్లకోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- కెరమెరి రేంజ్‌లో సిబ్బంది కొరత
- 35 మందికి ఉన్నది 12 మందే
- అడవుల విస్తీర్ణం 24వేల హెక్టార్లు
- ప్రశ్నార్థకంగా అటవీ సంరక్షణ



పరంధోలిలోని దట్టమైన అడవి



కెరమెరిలోని అటవీ రేంజ్ కార్యాలయం

కెరమెరి: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాగా ఏర్పడిన తర్వాత కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ) మండలాలను కలిపి కొత్తగా కెరమెరిలో అటవీరేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఈ రేంజ్‌కు సరిపడా సిబ్బంది లేక అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణం గల రేంజ్ కావడంతో పాటు కలప అధికంగా ఇక్కడే ఉంది. ఇటీవల కాలంలో మండలంలోని కొన్ని ప్రాంతాల్లో పులి, చిరుత సంచారం కూడా కన్పించింది. కొన్ని ప్రాంతాల్లో అల్లకల్లోలం సృష్టించి ఇతర మూగజీవాలను అవి హతమార్చాయి. రేంజ్ పరిధిలో సరిపడా సిబ్బంది లేక అక్రమ కలప రవాణా జరుగుతుండడంతో అడవుల సంరక్షణ సిబ్బందికి ఇబ్బందిగా మారింది.

12 మందే అధికారులు..

కెరమెరి రేంజ్ పరిధిలో మూడు మండలాలు ఉన్నాయి. మొత్తంగా పది మంది అటవీ సెక్షన్ అధికారులు, 25 మంది అటవీ బీట్ అధికారులు ఉండాలి. కానీ ఇక్కడ కేవలం ఆరుగురు బీట్ అధికారులు, ఆరుగురు సెక్షన్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. మూడు మండలాలు కలిపి మొత్తంగా 24 వేల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ మండలాల్లోని అడవుల్లో కలప కూడా పుష్కలంగా లభిస్తుండడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోయే అవకాశం కూడా ఉంది.

మొదటి నుంచి ఇదే పరిస్థితి..

రేంజ్ కార్యాలయం ప్రారంభం నుంచే సిబ్బంది లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏనాడు కూడా అనుకున్న స్థాయిలో అటవీ అధికారులను భర్తీ చేయలేదు. దీంతో అడవుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. గతంలో పలు ప్రాంతాల్లో బీట్, సెక్షన్ అధికారులను భర్తీ చేసినప్పటికీ ఇక్కడ మాత్రం ఒక్కరిని కూడా నియమించలేదు. దీంతో ఉన్న సిబ్బందితో నెట్టుకురావడంతో ఉన్న వారికి తలకు మించిన భారమైంది. ఇటీవల కాలంలో పులులు సైతం ఇక్కడి అడవుల్లో సంచరించాయి. అనేక ప్రాంతాల్లో పాదముద్రలు కనిపించడంతో, కొన్నిచోట్ల మూగజీవాలపై దాడి చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈనేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి అటవీ సిబ్బందిని భర్తీ చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి..



రేంజ్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో చాలా కష్టమవుతుంది. కెరమెరిలో దట్టమైన అడవులు ఉండడంతో రక్షణ ఇబ్బందిగా మారింది. రాత్రి, పగలు నిఘా పెట్టడం కష్టమవుతుంది. తక్షణమే సరిపడా సిబ్బందిని నియమించాలి.

– సయ్యద్ మజారొద్దీన్, ఎఫ్ఆర్‌వో, కెరమెరి

'మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'



సన్మానిస్తున్న మాలీ సంఘం సభ్యులు

కౌటాల: మాలీ కులస్తులను ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావు అన్నారు. ఇటీవల జరిగిన మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన లెండుగురే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్, జిల్లా అధ్యక్షులు సెండే వాసు, ప్రధాన కార్యదర్శి నికోడే గంగారంను కౌటాల మాలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక మాలీ సంఘం భవనంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మాలీ కులస్తుల జీవన స్థితిగతులను తెలుసుకోవడానికి ప్రత్యేక సర్వే నిర్వహించాలన్నారు. మాజీ సర్పంచులు మోర్లె రమేశ్, ఆదే శ్రీనివాస్, వాసాకే నిహారిక, సంఘం నాయకులు జ్యోతిరావ్, నాందేవ్, ప్రదీప్, ముక్తేశ్వర్, పాండురంగ్, బాపురావు, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రెబ్బెన: ప్రజా సమస్యలపై సీపీఎం పార్టీ సమరశీల పోరాటాలు చేస్తోందని సీపీఎం పార్టీ రాంపూర్ కార్యదర్శి చాపిడి పురుషోత్తం అన్నారు. శనివారం రాంపూర్‌లో సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ప్రభుత్వంతో పోరాడుతోందన్నారు. కుమురంభీం ప్రాజెక్టు కాల్వల నిర్మాణం పూర్తి చేసి రైతుల పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్య కళాశాలలో సిబ్బందిని నియమించాలన్నారు. నాయకులు వంశీ, శివ, హరీశ్, కృష్ణ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌కు చెందిన మాచర్ల అశోక్‌పై కత్తితో దాడికి పాల్పడిన మాచర్ల సురేశ్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ బుద్దె రవీందర్ తెలిపారు. పందుల వ్యాపార లావాదేవీ విషయంలో శుక్రవారం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో సురేశ్ కక్షపూరితంగా అశోక్‌పై కత్తితో దాడి చేశాడని, అశోక్ తండ్రి చిన్న నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రవీందర్ వెల్లడించారు.

షెడ్డు నిర్మాణం కోసం స్థలం పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల ప్రసిద్ధ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న జాతర మహోత్సవం నేపథ్యంలో నిర్మించనున్న రేకుల షెడ్డు కోసం అనువైన స్థలాన్ని శనివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ గంటుమేర, నాయకులు గుంపుల విమలేశ్‌లు పరిశీలించారు. నాయకులు భీంరావు పాల్గొన్నారు.